ఆమెకు వంట తప్ప ఇంకేం తెలుసు?

బీజేపీ అభ్యర్థినిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్య

బెంగళూరు, మార్చి 30: లోక్‌సభ ఎన్నికల వేళ కర్ణాటకలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఒకరిపై మరొకరు పరస్పరం విమర్శల దాడికి దిగుతున్నారు. మహిళలను ఉద్దేశించి కర్ణాటక కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే శివశంకరప్ప అనుచిత వ్యాఖ్యలు చేశారు. 'ప్రజల ముందు కనీసం మాట్లాడే సత్తా లేదు. ఆమె వంటింటికి మాత్రమే సరిపోతారు' అంటూ దేవనగరి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థిని గాయత్రి సిద్ధేశ్వరను కించపరుస్తూ శివశంకరప్ప వ్యాఖ్యలు చేశారు. ఆమె ఎన్నికల్లో పోటీ చేయడానికి కాదు, వంటింటిలో పనిచేయడానికి సరిపోతారు..అంటూ వెక్కిరించారు. కాంగ్రెస్ నేత వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘానికి బీజేపీ ఫిర్యాదు చేసింది. 92 ఏండ్ల శివశంకరప్ప హస్తం పార్టీలో అత్యంత వృద్ధ నేత. ప్రస్తుతం ఆయన దేవనగిరి దక్షిణం నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు.

చాలా బాధాకరం : సైనా నెహ్వాల్
శివశంకరప్ప వ్యాఖ్యలపై బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మహిళలు వంట గదికే పరిమితం అవ్వాలంట-కాంగ్రెస్ సీనియర్ నేత శివశంకరప్ప చేసిన వ్యాఖ్యలివి. మహిళలు పలు రంగాల్లో కలలు కంటున్నప్పుడు ఎందుకు కించపరుస్తున్నారు. స్త్రీద్వేష వ్యక్తుల నుంచి మహిళలకు అవమానం జరుగుతున్నది. ఇది నిజంగా చాలా బాధాకరం' అని సైనా రాసుకొచ్చారు.

టీసీఎస్‌పై జాతి వివక్ష ఆరోపణలు

వాషింగ్టన్: అమెరికాలోని టీసీఎస్ జాతి, వయసు ఆధారంగా వివక్ష ప్రదర్శిస్తున్నదని ఆ కంపెనీ నుంచి తొలగింపునకు గురైన 22 మంది ఉద్యోగులు ఆరోపించారు. హెచ్-1బీ వీసాలు గల భారతీయ వర్కర్ల కోసం తమను అకస్మాత్తుగా ఉద్యోగాల నుంచి తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై వివక్ష ప్రదర్శిస్తూ, ఇండియన్ వర్కర్లకు ప్రాధాన్యమిస్తూ, ఈ కంపెనీ చట్టాలను ఉల్లంఘిస్తున్నదని మండిపడ్డారు. వీరిలో కాకసియన్స్, ఆసియన్-అమెరికన్స్, హిస్పానిక్ అమెరికన్స్ ఉన్నారు. ఆరోపణలను టీసీఎస్ ఖండించింది. తాము అత్యున్నత స్థాయి విలువలతో పని చేస్తున్నట్లు తెలిపింది. సమాన అవకాశాలు ఇచ్చే కంపెనీగా అమెరికాలో తమకు మంచి పేరు ఉందని వివరించింది.

కాలేజీ విద్యార్థికి 46 కోట్ల ఐటీ నోటీస్

గ్వాలియర్: మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు చెందిన ఓ కాలేజీ విద్యార్థికి ఐటీ శాఖ, జీఎస్టీ నుంచి రూ.46 కోట్లు పన్ను కట్టాలంటూ నోటీసులు వచ్చాయి. షాక్‌కు గురైన విద్యార్థి పోలీసులను ఆశ్రయించాడు. గ్వాలియర్‌కు చెందిన ప్రమోద్ కుమార్ బ్యాంకు ఖాతా నుంచి రూ.46 కోట్ల లావాదేవీలు జరిగాయని, అందుకు సంబంధించిన పన్ను చెల్లించాలన్నది నోటీసుల సారాంశం. కంగుతిన్న ఆ విద్యార్థి సంబంధిత అధికారులను సంప్రదించగా అసలు విషయం బయట పడింది. ప్రమోద్ పాన్ కార్డుపై ఏకంగా ఓ కంపెనీనే రిజిస్టర్ అయ్యినట్టు వెల్లడైంది. 2021 నుంచి ముంబై, ఢిల్లీ వేదికగా ఈ కంపెనీ కార్యకలాపాలు సాగించినట్టు తేలడంతో అతను వెంటనే పోలీసులను ఆశ్రయించాడు.

ఇది అన్ని పార్టీలకు హెచ్చరిక!

కాంగ్రెస్‌కు ఐటీ నోటీసులపై చిదంబరం

న్యూఢిల్లీ: కాంగ్రెస్‌కు ఐటీ శాఖ ఇచ్చిన నోటీసులు దేశంలోని ఇతర రాజకీయ పార్టీలు, ప్రజలకు కూడా ఓ హెచ్చరిక వంటిదని కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పీ చిదంబరం పేర్కొన్నారు. విపక్షాలన్నింటినీ నాశనం చేయడమే కేంద్రంలోని బీజేపీ సర్కార్ లక్ష్యమని ఆయన విమర్శించారు. మరోవైపు ఐటీ శాఖ నోటీసులపై కాంగ్రెస్ శ్రేణులు పలు రాష్ట్రాల్లో ఆందోళనలు చేపట్టాయి. మరోవైపు ఇప్పటికే సెటిల్ చేసుకొన్న ఒక కేసులో ఐటీ శాఖ తనకు నోటీసులు పంపిందని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తెలిపారు. కాగా, ఐటీ శాఖ నుంచి మరో రెండు నోటీసులు అందాయని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ తెలిపారు.

దక్షిణాదిపై వివక్ష

- రూపాయి ఇచ్చే బీహార్‌కు కేంద్రం ఇస్తున్నది 7 రూపాయలు
- అదే రూపాయి ఇస్తున్న తెలంగాణకు అర్ధరూపాయీ ఇవ్వట్లే
- తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల పరిస్థితి కూడా ఇంతే
- న్యాయంగా రావాల్సిన వాటాలోనూ కేంద్రం మొండిచేయి
- జనాభా, తక్కువ తలసరి గీటురాయిగా ఏకపక్ష నిబంధనలు
- 15వ ఫైనాన్స్ కమిషన్ రూల్స్‌తో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): కేంద్ర పన్ను రాబడిలో దక్షిణాది రాష్ట్రాలకు న్యాయంగా రావాల్సిన వాటా దక్కట్లేదు. ఉత్తరాది రాష్ట్రం బీహార్ వివిధ పన్నుల ద్వారా కేంద్రానికి రూపాయి ఇస్తున్నదనుకొంటే, దానికి ప్రతిగా కేంద్రం.. ఆ రాష్ట్రానికి రూ. 7.26 తిరిగి చెల్లిస్తున్నది. ఇదే సమయంలో అదే రూపాయి ఇస్తున్న తెలంగాణకు కేవలం 0.47 పైసలనే విదిలిస్తున్నది. ఒక్క తెలంగాణకే కాదు.. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్ విషయంలోనూ ఇలాగే పక్షపాతధోరణి అవలంబిస్తున్నది. అందుకే, కేంద్ర పన్నుల్లో తమకు తక్కువ వాటా ఇస్తున్నారని తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రప్రభుత్వంపై ఎప్పటి నుంచో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీడీపీలో 32 శాతం మేర వాటాని కలిగి ఉన్నప్పటికీ, దక్షిణాది రాష్ట్రాలకు ఇచ్చే ఆదాయంలో పక్షపాతం ఎందుకు జరుగుతున్నది? 15వ ఆర్థిక సంఘం సిఫారసులతో దక్షిణాదికి జరుగుతున్న నష్టమేంటి?

నిధుల కేటాయింపులు ఇలా..
రాష్ట్రాల సమూహమే దేశం. అంటే కేంద్రప్రభుత్వానికి ఆదాయమంటూ వస్తే అది రాష్ట్రాల నుంచే రావాలి. అలా రాష్ట్రాల నుంచి సేకరించిన నిధులు కేంద్రానికి వెళ్ళిన తర్వాత కొన్ని ప్రమాణాలకు అనుగుణంగా కొంత మొత్తంలో రాష్ట్రాలకు తిరిగి పంపిణీ అవుతాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 280 ప్రకారం.. ఈ నిధుల కేటాయింపులను నిర్ణయించడానికి ప్రతీ ఐదేండ్లకు ఓసారి ఆర్థిక సంఘాలను (ఫైనాన్స్ కమిషన్) ఏర్పాటు చేస్తారు. కమిషన్‌పై నిర్ణయాధికారం కేంద్రానిదే. ఈ ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు పంచుకొంటాయి. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం సిఫారసులు (2021-2026) అమలులో ఉన్నాయి. అయితే, 14వ ఆర్థిక సంఘం ఉన్నంత వరకు కేంద్రం ఆదాయంలో 42 శాతం వాటా రాష్ట్రాలకు పంపిణీ అయ్యేది. 15వ కమిషన్ సిఫారసుల్లో ఈ వాటాను 41 శాతానికి తగ్గించారు.

ప్రమాణాలు ఏమిటంటే?
15వ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం.. ఆరు ప్రమాణాలను బట్టి రాష్ట్రాలకు నిధుల పంపిణీ జరుగుతున్నది. రాష్ట్రాల విస్తీర్ణం (15%), రాష్ట్రాల జనాభా (15%), అత్యల్ప తలసరి ఆదాయం (45%), అటవీ, పర్యావరణం (10%), పన్ను వసూలులో రాష్ట్రాల సామర్థ్యం (2.5%), జనాభా నియంత్రణలో రాష్ట్రాల పనితీరు (12.5%)ను బట్టి ఈ కేటాయింపులు చేస్తున్నారు. అయితే, 10వ, 11వ, 12వ, 13వ, 14వ ఆర్థిక సంఘాలు రాష్ట్రాల జనాభాను 1971 సంవత్సర లెక్కల ప్రకారం తీసుకొంటే, 15వ ఆర్థిక సంఘం మాత్రం 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకొన్నది. అలాగే, నిధుల పంపిణీలో మారిన పరిస్థితులను బట్టి కాకుండా అత్యల్ప తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రాలకు 45 శాతం వాటాను కేటాయించింది. ఈ రెండు కారణాల వల్లే.. కేంద్రానికి అత్యధిక రాబడిని వచ్చేలా చేసినప్పటికీ, దక్షిణాది రాష్ట్రాలకు నిధుల పంపిణీలో అన్యాయం జరుగుతున్నది.

జనాభా, రాబడిలో మార్పులు ఇలా..
70వ దశకం మధ్యలో జనాభా పెరుగుదలను నియంత్రించే ప్రయత్నాలను కేంద్రం తీవ్రతరం చేసింది. జననాలను కట్టడి చేసే రాష్ట్రాలకు ప్రోత్సాహకాలను ప్రకటించింది. దీంతో దక్షిణాదిన ఉన్న కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు జనాభా నియంత్రణను చేపడితే.. ఉత్తరాది రాష్ట్రాల్లో అలా జరగలేదు. దీంతో ఉత్తరాదిన జనవిస్ఫోటనం జరిగింది. పరిశ్రమల స్థాపన, ఉద్యోగావకాశాలు తదితర అభివృద్ధి పనులు దక్షిణాదిన ఊపందుకొని ప్రజల తలసరి ఆదాయం పెరిగితే, ప్రభుత్వాల వైఫల్యం కారణంగా యూపీ, బీహార్ వంటి ఉత్తరాది రాష్ట్రాల్లో అలా జరుగలేదు. దీంతో జనాభాలో 19 శాతం వాటా కూడా లేని దక్షిణాది రాష్ట్రాలు .. ప్రస్తుతం జీడీపీలో 32 శాతం వాటాని కలిగి ఉన్నాయి. 1976 తర్వాత ఏర్పాటైన ఫైనాన్స్ కమిషన్లు (10వ ఫైనాన్స్ కమిషన్ నుంచి) 1971 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకొన్నాయి. 14వ ఆర్థిక సంఘం వరకు ఇదే పద్ధతి కొనసాగింది. ఆ లెక్కన జనాభా నియంత్రణ పాటించకముందు ఉన్న జనాభా లెక్కలను తీసుకోవడంతో రాబడి వాటాల్లో దక్షిణాదికి కొంత మేర న్యాయం జరిగింది. కానీ, 15వ ఆర్థిక సంఘం తాజా జనాభా లెక్కలను (2011నాటి జనాభా లెక్కలు) ఉపయోగిస్తున్నది. అంతేకాకుండా.. 2011నాటి రాష్ట్రాల జనాభాకు, అత్యల్ప తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రాలకు 60 శాతం మేర ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో జనాభా నియంత్రణ పాటించి, పౌరుల తలసరి ఆదాయాన్ని పెంచిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగింది. జనాభా నియంత్రణలో మంచి పనితీరు కనబర్చిన రాష్ట్రాలకు 12.5% పాయింట్లు ఇస్తామన్నప్పటికీ, దీనికి 1971 కాకుండా 2011వ సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకొన్నారు. అలా కూడా దక్షిణాది రాష్ట్రాలకు నష్టమే మిగిలింది. అంటే ఒక్క మాటలో చెప్పాలంటే.. జనాభాను నియంత్రించకుండా, పౌరుల ఉపాధి కల్పనను గాలి కొదిలేసి వారి తలసరి ఆదాయానికి గండికొట్టిన ఉత్తరాది రాష్ట్రాలకే కేంద్రం ఎక్కువ నిధులను కేటాయిస్తున్నది. అందుకే, దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ పరిణామాన్ని ఖండిస్తున్నారు. దేశాభివృద్ధికి చోదకశక్తిగా పని చేస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు న్యాయంగా దక్కాల్సిన వాటాను ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.

పన్నుల వాటాలో దక్షిణాది రాష్ట్రాలపై వివక్షను నిరసిస్తూ డీఎంకే ఎంపీల ధర్నా (ఫైల్)

ఒక్కో రాష్ట్రం నుంచి ఒక్కో రూపాయి చొప్పున రాబడి వస్తే.. తిరిగి ఏ రాష్ట్రానికి కేంద్రం ఎంత ఇస్తున్నదంటే? (2023-24 ఆర్థిక సంవత్సరం)

రాష్ట్రం	చెల్లింపులు(రూ.ల్లో)
బీహార్	7.26
ఉత్తరప్రదేశ్	2.49
మధ్యప్రదేశ్	2.09
ఒడిశా	1.25
రాజస్థాన్	1.20
కేరళ	0.62
ఆంధ్రప్రదేశ్	0.52
తెలంగాణ	0.47
తమిళనాడు	0.28
కర్ణాటక	0.17

నష్టాలు ఇలా..

10వ, 15వ ఆర్థిక సంఘం చేసిన సిఫారసులను పోల్చిచూస్తే దక్షిణాదికి జరుగుతున్న అన్యాయం స్పష్టమవుతున్నది. 2022-23 ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే తెలంగాణ, ఏపీకి కేంద్రం నుంచి న్యాయంగా రావాల్సిన నిధుల్లో రూ. 23,604 కోట్లు కోత పడ్డాయి. ఇక, తమిళనాడుకు రూ. 21,284 కోట్లు, కేరళకు రూ. 16,176 కోట్లు, కర్ణాటకకు రూ. 13,346 కోట్లు నష్టం వాటిల్లింది. ఇదే సమయంలో మధ్యప్రదేశ్.. రూ. 33,855 కోట్లు, యూపీ.. రూ. 12,049 కోట్లు, బీహార్.. రూ. 13,883 కోట్లు అదనంగా లబ్ధిపొందాయి.

పీవీ తరపున భారతరత్న పురస్కారాన్ని రాష్ట్రపతి ముర్ము చేతులమీదుగా అందుకుంటున్న ఆయన కుమారుడు పీవీ ప్రభాకర్ రావు

పీవీకి భారతరత్న ప్రదానం

- ఆయన కుమారుడికి అందజేసిన రాష్ట్రపతి ముర్ము
- మరో ముగ్గురి తరపున కుటుంబీకుల స్వీకరణ
- నేడు ఎల్‌కే అద్వానీకి స్వగృహంలో అందజేత

న్యూఢిల్లీ, మార్చి 30: దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్నను మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, చరణ్ సింగ్ సహా మరో ఇద్దరికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అందజేశారు. శనివారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో దేశ ప్రథమ పౌరురాలు వీటిని అందజేశారు. తెలంగాణ ముద్దు బిడ్డ, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తరపున ఆయన కుమారుడు పీవీ ప్రభాకర్ రావు భారత రత్న పురస్కారాన్ని అందుకున్నారు. చౌదరీ చరణ్‌సింగ్ తరపున ఆయన మనవడు జయంత్ చౌదరి, కర్పూరీ ఠాకూర్ తరపున ఆయన కుమారుడు శ్రీరామ్‌నాథ్ ఠాకూర్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ తరపున ఆయన కుమార్తె నిత్యా రావు భారత రత్నను స్వీకరించారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, ప్రధాని నరేంద్ర మోదీ, ఇతర ప్రముఖులు, అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులు పురస్కారాల ప్రదానోత్సవానికి హాజరయ్యారు. భారత రత్న పొందిన బీజేపీ కురు వృద్ధుడు, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీకి ఆదివారం ఆయన సొంత ఇంట్లో ఈ పురస్కారాన్ని అందజేయనున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

పీవీ సేవలు చిరస్మరణీయం: మోదీ
ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ పీవీ నరసింహారావు భారత జాతికి చేసిన సేవలను ప్రతి భారతీయుడు గుర్తుంచుకుంటాడని, ఆయనకు భారతరత్న లభించినందుకు గర్వపడుతున్నానని, మన దేశ అభివృద్ధి, ఆధునికీకరణకు ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా పీవీ గౌరవనీయ పండితుడు, జ్ఞాని, ఆలోచనా పరుడని, ఆయన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు. అలాగే భారత రత్న వచ్చిన మిగిలిన వారిని ప్రధాని మోదీ ప్రశంసించారు.

పురస్కారాలు అందుకుంటున్న జయంత్, నిత్యా రావు, రామ్‌నాథ్ ఠాకూర్

పబ్లిక్ చార్జింగ్ పోర్టళ్లతో జాగ్రత్త

ప్రజలకు కేంద్ర ప్రభుత్వం కీలక సూచన



న్యూఢిల్లీ, మార్చి 30: దేశ ప్రజలకు కేంద్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలోని ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్(సెర్ట్) శనివారం కీలక సూచన చేసింది. హోటళ్లు, బస్టాండ్లు, కేఫ్‌లు, ఎయిర్‌పోర్టులు తదితర ప్రదేశాల్లో ఉండే పబ్లిక్ చార్జింగ్ పోర్టళ్ల స్మార్ట్‌ఫోన్‌లకు చార్జింగ్ పెట్టే సమయంలో జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నది. పబ్లిక్ చార్జింగ్ పోర్టళ్ల ద్వారా దుండగులు ఫోన్‌లలోని సమాచారాన్ని చోరీ చేయవచ్చని, హానికరమైన యాప్‌లను ఫోన్‌లలో ఇన్‌స్టాల్ చేయవచ్చని తెలిపింది. డాటాను తొలగించి మళ్లీ రిస్టోర్ చేయడానికి డబ్బులు అడిగే అవకాశం కూడా ఉందని పేర్కొన్నది. బయటకు వెళ్లినప్పుడు పవర్ బ్యాంకులు లేదా చార్జర్లను తీసుకెళ్లాలని సెర్ట్ సూచించింది. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో పబ్లిక్ చార్జింగ్ పోర్టళ్లలో చార్జింగ్ పెట్టాల్సి వచ్చినప్పుడు ఫోన్‌లను స్విచాఫ్ చేసి పెట్టాలని సూచించింది. ఏదైనా సైబర్ మోసానికి గురైతే www.cybercrime.gov.in పోర్టల్‌లో లేదా 1930 నెంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని పేర్కొన్నది.

యూఎస్ఎస్‌డీ ఆధారిత కాల్ ఫార్వర్డ్ సేవలకు చెల్లు

న్యూఢిల్లీ: ఏప్రిల్ 15 నుంచి యూఎస్ఎస్‌డీ ఆధారిత కాల్ ఫార్వర్డింగ్ సేవలను నిలిపివేయాలని టెలికాం ఆపరేటర్లను టెలికమ్యూనికేషన్స్ విభాగం ఆదేశించింది. ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషించాలని సూచించింది. ప్రస్తుతం *401# డయల్ చేయడం ద్వారా సులువుగా కాల్ ఫార్వర్డ్ చేసే అవకాశం ఉంది. దీనినే యూఎస్ఎస్‌డీ ఆధారిత కాల్ ఫార్వర్డింగ్ అంటారు. ఈ సదుపాయం దుర్వినియోగం అవుతున్న ఘటనలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. కొందరు మోసగాళ్లు.. కస్టమర్ కేర్ నుంచి కాల్ చేస్తున్నామని ఫోన్ చేసి, 'మీ సిమ్‌లో సమస్య ఉంది. ఒకసారి *401# డయల్ చేయండి' అని అడుగుతున్నారు. ఇలా డయల్ చేసిన వారి కాల్స్‌ను, మెసేజ్‌లను తమకు ఫార్వర్డ్ చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు.

29 కోట్ల టీఎంసీ మాజీ ఎంపీ ఆస్తుల అటాచ్

న్యూఢిల్లీ, మార్చి 30: మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా టీఎంసీ మాజీ ఎంపీ కన్వర్ దీప్ సింగ్‌కు చెందిన రూ.29 కోట్లకు పైగా విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) శనివారం వెల్లడించింది. ఇందులో హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, మధ్యప్రదేశ్‌లలో కన్వర్ దీప్ సింగ్ కంపెనీ ఆల్కెమిస్ట్ గ్రూపునకు చెందిన బీచ్‌క్రాఫ్ట్ విమానం, ఫ్లాట్లు, ఇతర ఆస్తులు ఉన్నాయని తెలిపింది. అధిక లాభాలతో పాటు ఫ్లాట్లు, విల్లాలు ఇస్తామన్న తప్పుడు హామీలతో కన్వర్ దీప్ సింగ్‌కు చెందిన కంపెనీ సాధారణ ప్రజల నుంచి రూ.1,800 కోట్ల మేర సొమ్ము వసూలు చేసిందన్న ఆరోపణలపై నమోదైన కేసులకు సంబంధించి ఈడీ దర్యాప్తు చేస్తున్నది.

మద్యం పాలసీ కేసులో ఆప్ మంత్రి విచారణ

ఈడీ అడిగిన అన్ని ప్రశ్నలకు జవాబులిచ్చా: కైలాశ్

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం విధానం కేసు దర్యాప్తులో శనివారం కీలక పరిణామం జరిగింది. రాష్ట్ర మంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నేత కైలాశ్ గెహ్లాట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల విచారణకు హాజరయ్యారు. 2021-22 సంవత్సరానికి సంబంధించిన ఈ విధానాన్ని రూపొందించిన మంత్రుల బృందంలో ఆయన కూడా సభ్యుడు కావడంతో ఈడీ ఆయనను విచారణకు పిలిచింది. గెహ్లాట్ రవాణా, హోం, న్యాయ శాఖలను నిర్వహిస్తున్నారు. మంత్రుల బృందంలో మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, మాజీ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సత్యేందర్ జైన్ కూడా సభ్యులుగా ఉన్నారు. ఈ విధానాన్ని సౌత్ గ్రూప్ లిక్కర్ లాబీకి లీక్ చేశారని, అందుకు ప్రతిఫలంగా ఈ లాబీ రూ.100 కోట్ల లంచాన్ని ఆమ్ ఆద్మీ పార్టీకి, ఆ పార్టీ నేతలకు ఇచ్చిందని, ఈ డబ్బులను గోవా ఎన్నికల ప్రచారం కోసం వినియోగించారని ఈడీ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. గెహ్లాట్ సింగిల్ సిమ్‌ను వాడారని, అయితే ఐఎంఈఐ మూడుసార్లు మారిందని ఈడీ ఆరోపించింది. ఈ కేసులో గతంలో అరెస్టయిన విజయ్ నాయర్ కొంత కాలంపాటు నజఫ్‌గఢ్‌లోని ప్రభుత్వ బంగళాలో బస చేశారని, ఈ బంగళా గెహ్లాట్‌కు కేటాయించినదని, ఇది నేరపూరిత నమ్మక ద్రోహమని ఈడీ వాదిస్తున్నది. కాగా, ఈడీ విచారణ అనంతరం కైలాశ్ గెహ్లాట్ విలేకరులతో మాట్లాడుతూ... ఈడీ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పానని తెలిపారు. తాను ఆమ్ ఆద్మీ పార్టీ గోవా ప్రచారంలో భాగం కాలేదని, ఏం జరిగిందనేది తనకు తెలియదని పేర్కొన్నారు. తనకు ప్రభుత్వ బంగళా కేటాయించినప్పటికీ, తన భార్యాపిల్లలకు ఇష్టం లేకపోవడం వల్ల సొంతింట్లోనే నివసిస్తున్నానని చెప్పారు.

సాక్షుల్లో ఒకరికి బీజేపీతో సంబంధాలు
ఢిల్లీ మద్యం పాలసీ కేసులోని సాక్షుల్లో ఒకరైన మాగుంట రాఘవ రెడ్డి తండ్రి శ్రీనివాసులు రెడ్డిని టీడీపీ లోక్‌సభ ఎన్నికల బరిలో దించిందని ఆమ్ ఆద్మీ పార్టీ తెలిపింది. టీడీపీ, బీజేపీ మిత్రపక్షాలని; ఈడీ స్వతంత్ర సంస్థ అయి ఉంటే, రాఘవ రెడ్డి, బీజేపీ మధ్య సంబంధాలపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. సౌత్ లాబీతో బీజేపీకి సంబంధాలు ఉన్నాయని ఢిల్లీ రాష్ట్ర మంత్రి ఆతిశీ ఆరోపించారు.

జలమండలి కేసులో ఛార్జిషీట్!
ఢిల్లీ జల మండలిలో మనీలాండరింగ్ జరిగిందని ఆరోపించిన ఈడీ ఈ కేసులో ఈ నెల 28న ఛార్జిషీటును దాఖ లు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. డీజేబీ మాజీ చీఫ్ ఇంజినీరు జగదీశ్ కుమార్ అరో రా, కాంట్రాక్టర్ అనిల్ కుమార్ అగర్వాల్, మాజీ ఎన్‌బీసీసీ జనరల్ మేనేజర్ డీకే మిట్టల్, తేజిందర్ సింగ్, ఎన్‌కేజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌లను నిందితులుగా చేర్చినట్లు సమాచారం.

జార్ఖండ్ ల్యాండ్ స్కామ్‌లో ఛార్జిషీట్
రాంచీ: భూ కుంభకోణం కేసులో ఈడీ అధికారులు శనివారం ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో ఛార్జిషీట్‌ను దాఖలు చేశారు. రాంచీలోని బర్గాయ్‌లో ఉన్న భూములకు సంబంధించిన ఈ కేసులో మాజీ సీఎం హేమంత్ జ్యుడిషియల్ కస్టడీ గడువు ఏప్రిల్ 4 వరకు ఉంది.

సునీతకు సంఘీభావం తెలుపుతున్న హేమంత్ సొరేన్ సతీమణి కల్పన

సునీతకు కల్పన సొరేన్ సంఘీభావం

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సతీమణి సునీత కేజ్రీవాల్‌కు జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సొరేన్ సతీమణి కల్పన సొరేన్ శనివారం సంఘీభావం తెలిపారు. కేజ్రీవాల్ నివాసంలో వీరి భేటీ జరిగింది.శక్తిమంతులైన మహిళలు కలవడంతో బీజేపీ భయపడి ఉంటుందని.. వీరిద్దరి సమావేశంపై ఢిల్లీ మంత్రి ఆతిశీ ట్వీట్ చేశా రు. కల్పన విలేకర్లతో మాట్లాడుతూ, సునీత కేజ్రీవాల్‌కు యావత్తు జార్ఖం డ్ ప్రజలు అండగా ఉంటారని, తాము ఒకరి ఆవేదనను మరొకరం పంచుకున్నామని చెప్పారు.తాము కలిసికట్టుగా పోరాడాలని నిర్ణయించామన్నారు.

ఎన్ఐఏ సమన్లను పట్టించుకోని టీఎంసీ నేతలు

కోల్‌కతా: 2022లో పశ్చిమ బెంగాల్‌లోని పుర్బా మేదినీపూర్ జిల్లాలోని భూపతినగర్‌లో జరిగిన పేలుడు సంఘటనకు సంబంధించి విచారణ నిమిత్తం ఎన్ఐఏ పంపిన సమన్లను 8 మంది తృణమూల్ కాంగ్రెస్ నేతలు పట్టించుకోలేదని అధికార వర్గాలు వెల్లడించాయి. వారికి మరోసారి సమన్లు పంపే అవకాశమున్నట్టు తెలుస్తున్నది. మార్చి 28న న్యూటౌన్‌లోని ఎన్ఐఏ కార్యాలయానికి రావాలని సమన్లు పంపగా వారు లెక్క చేయకపోవడంతో శనివారం ఉదయం 11 గంటలకు తమ అధికారుల ముందు హాజరుకావాలని ఎన్ఐఏ కోరింది. అయినప్పటికీ వారు హాజరు కాలేదు.

న్యూస్‌క్లిక్‌పై 'ఉపా' కేసు

చార్జిషీట్ దాఖలు

న్యూఢిల్లీ: చైనాకు అనుకూలంగా ప్రచారం చేస్తూ భారత్‌పై విషం చిమ్మడానికి ఆ దేశం నుంచి పెద్దమొత్తంలో సొమ్ములు అందుకుందన్న ఆరోపణపై న్యూస్ పోర్టల్ 'న్యూస్‌క్లిక్'పై ఢిల్లీ ప్రత్యేక విభాగం పోలీసులు శనివారం తొలి చార్జిషీట్‌ను దాఖలు చేశారు. 'ఉపా' కింద పాటియాల హౌస్ కోర్టు అడిషనల్ సెషన్స్ జడ్జి హర్దీప్ కౌర్‌కు 8 వేల పేజీలతో ఈ చార్జిషీట్ సమర్పించారు. న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు, సంపాదకుడు ప్రబీర్ పుర్కాయస్థ, పీటీకే న్యూస్ క్లిక్ స్టూడియోలను నిందితులుగా పేర్కొన్నారు. కాగా, ఈ కేసులో అరెస్టయిన మరో నిందితుడు అమిత్ చక్రవర్తి ఇప్పటికే అప్రూవర్‌గా మారారు.



మనుషుల చెవికి రెప్లికా సృష్టి

న్యూయార్క్, మార్చి 30: అచ్చం మనుషుల చెవిలానే ఉండే చెవి రెప్లికా(ప్రతిరూపం)ను అమెరికాలోని వెయిల్ కార్నెల్ మెడిసిన్, కార్నెల్ ఇంజినీరింగ్‌కు చెందిన శాస్త్రవేత్తలు సృష్టించారు. అమెరికా శాస్త్రవేత్తలు టిష్యూ ఇంజినీరింగ్, 3డీ ప్రింటింగ్ సాంకేతికతలను వినియోగించి ఈ చెవి రెప్లికాను తయారుచేశారు. పుట్టుకతోనే చెవి సరిగ్గా లేని వారికి, తర్వాతి కాలంలో చెవి కోల్పోయిన వారికి దీనిని అమర్చవచ్చని వెయిల్ కార్నెల్ మెడిసిన్‌కు చెందిన డాక్టర్ జాసోన్ స్పెక్టర్ తెలిపారు.

జీవిత భాగస్వామిని 'భూతం' అనడం క్రూరత్వం కాదు!

పాట్నా హైకోర్టు అభిప్రాయం

పాట్నా, మార్చి 30: ఒక వ్యక్తి తన జీవిత భాగస్వామిని 'భూతం, పిశాచి' అంటూ పిలువడం క్రూరత్వం కిందకేమీ రాదని పాట్నా హైకోర్టు అభిప్రాయపడింది. ఓ విడిపోయిన భార్యాభర్తల కేసు విచారణ సందర్భంగా జస్టిస్ వివేక్ చౌదరి తాజాగా ఈ వ్యాఖ్యలు చేశారు. 21 శతాబ్దంలో కూడా భర్త తన భార్యను భూతం, పిశాచి అని పిలిచారని, ఇది తీవ్ర క్రూరత్వం కింద వస్తుందని మహిళ తరపు లాయర్ వాదనను న్యాయమూర్తి వ్యతిరేకించారు. కేసు వివరాల్లోకి వెళితే కట్నం కోసం భర్త నరేశ్ గుప్తా, మామ సహదేవ్ గుప్తా తనను హింసకు గురి చేస్తున్నారంటూ ఒక మహిళ 1994లో కేసు వేసింది. దీనిపై ఏడాది శిక్ష పడగా, అడిషనల్ సెషన్స్ కోర్టు 10 ఏండ్ల తర్వాత దానిని సమర్థించింది. ఈ మధ్య కాలంలో సదరు భార్యాభర్తలకు జార్ఖండ్ హైకోర్టు విడాకులు మంజూరు చేసింది. కింది కోర్టుల తీర్పులను సవాల్ చేస్తూ తండ్రీ కొడుకులు పాట్నా హైకోర్టును ఆశ్రయించగా.. హైకోర్టు వాటిని కొట్టివేసింది.



మధ్య భారతంలో వడగాల్పులు

న్యూఢిల్లీ : మధ్య భారతంలోని చాలా ప్రాంతాల్లో ఎండల తీవ్రత ప్రజలను బాధిస్తున్నది. గురువారం ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్ కన్నా ఎక్కువగా నమోదయ్యాయి. ఢిల్లీలో ఈ సీజన్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన రోజుగా బుధవారం నిలిచింది. అలాగే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఏపీలోని రాయలసీమలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎంపీలోని సాగర్‌లో 42.5, మహారాష్ట్రలోని అకోలాలో 42.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ఆకాశ్ క్షిపణి వీడియో విడుదల

న్యూఢిల్లీ: ఆకాశ్ క్షిపణికి సంబంధించిన ఓ వీడియోను శనివారం ఇండియన్ ఆర్మీ షేర్ చేసింది. ఈ వీడియోలో ఆకాశ్ మిస్సైల్ టార్గెట్ ఎంగేజ్‌మెంట్ సామర్థ్య ప్రదర్శన ఉన్నది. క్షిపణి వ్యవస్థ ఎలా పని చేస్తుందో కూడా చూపించారు. సముద్ర తీరం వద్ద ఈ క్షిపణిని పరీక్షించారు. హై ఆల్టిట్యూడ్‌లో కూడా టార్గెట్‌ను ఎంత కచ్చితంగా ఇది ధ్వంసం చేయగలదో వీడియోలో చూపించారు. 10 నుండి 40 కి.మీల ఎత్తులో విహరించే డ్రోన్లను కూడా ఈ మిస్సైల్ కూల్చేయగలదు.

ప్రమాదంలో లౌకికవాదం

కేంద్రంపై విజయన్ ఆగ్రహం

తిరువనంతపురం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కేరళ సీఎం విజయన్ మరోసారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశ లౌకిక, ప్రజాస్వామిక విధానాన్ని మోదీ సర్కార్ ప్రమాదంలో పడేస్తున్నదని శనివారం విమర్శించారు. దేశ లౌకికత్వంపై కేంద్ర ప్రభుత్వం వరుసగా చేస్తున్న దాడి వల్ల దశాబ్దాలుగా ఇక్కడే నివసిస్తున్న చాలా మంది ప్రజలు ఇకపై భారత్‌లో జీవించగలమా? అని ఆందోళన చెందుతున్నారని విజయన్ పేర్కొన్నారు.